


చెదిరిన జుట్టు, చెరిగిన కాటుక, కందిన చెక్కిళ్ళు, కోపంతో అదురుతున్న పెదాలు, దుఃఖంతో పూడుకుపోయిన కంఠం. ఇందిర తనను తాను సంబాళించుకుని శ్రుతితో అసలువిషయం చెప్పడానికి ప్రయత్నిస్తోంది. ఆమెవెనుక ఉరిశిక్షకు సిద్ధమవుతున్న ముద్దాయిలా తలవంచుకుని నిలబడింది రంగ.

"ఏమిటి దంపతులిద్దరూ చెరో సారి వచ్చారు? ఇంతకుముందే మీవారు 'అర్చన'ను తీసుకొచ్చి చూపించివెళ్ళారు. ఏమిటలా చిక్కిపోయింది అర్చన?.... నువ్వేమిటలా వున్నావు? నైట్ డ్యూటీ చేశావా?" ఇందిర వంక పరిశీలనగా చూస్తూ ప్రశ్నలు కురిపించింది శ్రుతి. ఇందిర టెలిఫోన్ ఆపరేటర్‌గా చేస్తుంది. ఆమె పిల్లలిద్దరూ శ్రుతి నర్సింగ్‌హోమ్‌లోనే పుట్టారు. ఆమె శ్రుతిని డాక్టరుగా కాక స్నేహితురాలిగా, శ్రేయోభిలాషిగా భావిస్తుంది. తనకే సమస్య వచ్చినా శ్రుతి సలహా తీసుకుని దాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నిస్తుంది.

"నువ్వంతగా దిగులు పడాల్సిందేమీ లేదు. ఇందాక మీవారలాగే అర్చన బ్లడ్ కొంచెం టెస్ట్‌కు తీసుకుంటే తెగ బాధపడిపోయారు. కూతురంటే ఆయనకెంత ప్రాణమో ఈరోజు చూశాను." ఇందిరను ఓదార్చడానికి ప్రయత్నించింది శ్రుతి.

"అది కాదు మేడమ్!" రంగ రెక్క పుచ్చుకుని ముందుకు లాగింది ఇందిర.

"ఇది తెలుసుగా మీకు!!" అప్పుడు గమనించింది శ్రుతి రంగను. ఇందిర మొదటి కాన్పుకు వచ్చినప్పుడు ఆరేళ్ళ పిల్ల రంగ. ఇందిర దూరపు బంధువుల పిల్ల. కళ్ళు విప్పిన కొద్ది నెలలకే తల్లిదండ్రుల్ని కోల్పోయిన దురదృష్టవంతురాలు. అమ్మమ్మ రెక్కలకింద ఒదిగి ఆరేళ్ళు వచ్చేవరకు పల్లెటూళ్ళో వున్న

## పేషెంట్ చెప్పే కథలు

రంగ ఇందిర తల్లివెంట ఇందిర బిడ్డనెత్తుకోవడానికి వచ్చింది. కడుపునిండా తిండయినా తింటుందని కొండంత సంబరంతో మనమరాల్ని పంపడానికి ఒప్పుకుంది రంగ అమ్మమ్మ.... ఇందిర తల్లి రంగ గురించి చెప్పింది. అప్పటి నుంచి ఇందిర వెంట ఈ అమ్మాయి తరచు వస్తూనే వుంది. ఈ పిల్ల తెలియకపోవడమేం తనకు?

"నీ యింట్లో యిన్నాళ్ళనుంచి వుంటున్నా ఈ పిల్లకు బిత్తర చూపులూ, అమాయకత్వం పోలేదేమిటిందిరా?"

"అదే ఆ అమాయకత్వమే యిప్పుడు కొంప ముంచింది" ఉలిక్కిపడి రంగ శరీరంలో వికసిస్తున్న యౌవనాన్ని గమనించింది శ్రుతి.

"ఇప్పుడు అమ్మ ముఖమెలా చూడాలో తెలియడంలేదు. వీళ్ళ అమ్మమ్మకేం సమాధానం చెప్పుకోవాలి?.... మేడమ్! ఒకసారి దీన్ని పరీక్ష చెయ్యండి ముందు. ఏమడిగినా, తిట్టినా, కొట్టినా, కోసినా సరిగ్గా సమాధానం చెప్పడం లేదు.... ఇది నా పిల్లల్తోపాటు పెరిగింది. వాళ్ళతోపాటు తిండి పెట్టాను. వాళ్ళకు కొన్నప్పుడల్లా బట్టలుకొన్నాను. నా మనిషిలా పెరిగింది. మెచ్యూర్ అయి సంవత్సర మయింది. అసలు అమ్మ అప్పుడే వాళ్ళమ్మమ్మ దగ్గరకు పంపేయమంది. ఇన్నాళ్ళూ దానితో చేయించుకున్నదంతా మరిచిపోయి, దిక్కూ మొక్కూ లేనిదాన్నిగా పంపేసి చేతులు దులుపుకుంటానికి మనసొప్పింది కాదు. రెండు మూడేళ్ళు పోయాక పెళ్ళి చేసి పంపిద్దామనుకున్నాను. యింత ఘోరం యిలా జరిగిపోతుందని కలలో కూడా అనుకోలేదు." కడుపులో యిముడ్చుకోలేని బాధతో ఆపకుండా చెప్పుకు పోతూంది ఇందిర. ఇందిర చెప్పేవి వింటూనే ఎగ్జామినేషన్ రూమ్‌లోకి తీసుకెళ్ళి రంగని పరీక్ష చేసింది శ్రుతి. ఐదవ మాసం నిండుతూంది. శ్రుతి హృదయం కలచివేసినట్లయింది. అనునిత్యం యిలాంటి అవివాహిత గర్భవతులెన్నంతో మందిని చూస్తున్నా యింత ముక్కుపచ్చలారని పిల్లల్ని ఈ పరిస్థితిలో చూస్తే కడుపు దేవేసినట్లుగా వుంటుంది. అమాయకత్వం, మూర్ఖత్వం, అతి తెలివి పరిస్థితులు, థ్రిల్ కోసం, ఎడ్వెంచర్ కోసం ఎంతకైనా తెగించే మనస్తత్వం ఆడపిల్లనీ స్థితిలో నిలబెడుతున్నాయని తెలుస్తూనే వుంది. కాని యిలాంటి పసితనం పోని అమ్మాయిల్ని దారుణమైన స్థితికి లాక్కొచ్చే పరమ కిరాతకులు....ఏ న్యాయస్థానంలో వీర్ని దోషులుగా నిలబెట్టి నిరూపించగలుగుతారు? ఏ న్యాయాధికారి వీళ్ళకు సరైన శిక్ష విధిస్తాడు?

"మీరే ఎలాగో ఈ ఆపదనుంచి గట్టెక్కించాలి" ప్రాధేయపూర్వకంగా చూసింది ఇందిర.

"ఇన్నాళ్ళూ ఎలా గుర్తించలేదు ఇందిరా? ఇప్పుడేం చేయాలన్నా చాలా రిస్క్" విచారంగా అంది శ్రుతి.

"ఇదంతా నా ఖర్మ. ఈ ఉద్యోగంవల్ల

ఎప్పుడూ ఉరుకులు, పరుగులు. దీనికి కాపలా కాస్తూ కూర్చునే సావకాశమే వుంటే యింకెందుకు?....ఆ వెధవెవరో చెప్పేడవ్వే అని చచ్చేట్టు బాదాను. కొట్టీ. కొట్టీ నా చేతులు నొప్పిపుట్టాయిగాని అది నోరువిప్పలేదు....దొంగరాస్కెల్! ఇంత ఘాతుకానికి ఒడిగట్టిన వాడెవడో. వాడి చెల్లెలికో, కూతురికో యిలా జరగాలి. నా శాపానికే ఆ శక్తి వుంటే వాడికా శాస్తి జరుగుతుంది. అప్పటికిగాని నా కసి తీరదు" ఆవేశంగా అంటున్న ఇందిర గుండెల్లో బడబాగ్ని ప్రజ్వరిల్లుతూంది.

"తప్పు అలా అనకు. తప్పు చేసింది ఒక దుష్టుడు అయితే, శిక్ష మరో అమాయకురాలికెందుకు?"

ప్రమాదంతో కూడినదైనా తప్పదని ఇందిర చెప్పాక, విధిలేక నర్సుని పిలిచి ఎబార్షన్ చెయ్యడానికన్నీ రెడీ చెయ్యమని చెప్పింది శ్రుతి.

"పిన్నీ!" అప్పటివరకూ శిలావిగ్రహంలా నుంచున్న రంగ ఆపరేషన్ థియేటర్‌లోకి రమ్మనగానే విహ్వలంగా చూస్తూ ఇందిరను కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్చింది. మృత్యు భయంతో గజగజ వణికిపోతూందా పిల్ల. నచ్చచెప్పి, కసిరి, బుజ్జగించి లోపలకు తీసుకు వెళ్ళింది శ్రుతి. రంగని బల్లమీద పడుకోబెట్టి, వాష్‌చేసుకుని, గ్లవ్స్ వేసుకుంటున్న శ్రుతికో ఆలోచనొచ్చింది. భయంతో, వధ్యశిల నెక్కబోతున్న మేకపిల్లలా వున్న ఈ అమ్మాయి నిప్పుడు బెదిరిస్తే తను గర్భవతి అవడానికి కారకు లెవరో చెప్పదా? చెప్తే, వాడికాళ్ళు విరగ్గొట్టయినాసరే ఈ అమ్మాయికి జరిగిన అన్యాయాన్ని సరిచేయొచ్చు.

"రంగా! ఇప్పుడయినా చెప్పు. ఎవరతను? చెప్తే ఏమీ చెయ్యను. లేకపోతే...." 'ట్రే'లోవున్న స్పెక్యులమ్స్‌ని ఒకదాని కొకటి తాటించి చప్పుడు చేసింది శ్రుతి.

"డాక్టరమ్మగారూ! నన్నేంచెయ్యొద్దు. నాకు ఆపరేషన్‌వద్దు." ఏడుస్తూ ప్రతిమాలింది రంగ. హృదయ విదారకంగావున్న ఆమె ఏడుపుచూస్తే జాలిగా వుంది శ్రుతికి. ఈ అర్భకపు పిల్లేనా ఇందిర కొట్టిన దెబ్బలకు ఒళ్ళప్పగించింది అనిపించింది.

"చెప్పుమరి." మరోసారి ఇన్స్ట్రుమెంట్స్‌తో శబ్దంచేసింది.

"చెప్తాను. మా బాబాయే.... మా పిన్ని నైట్ డ్యూటీకి వెళ్ళినప్పుడు.." వెక్కుతూ చెప్తూంది రంగ. రాయిలా నిలబడిపోయింది శ్రుతి. ఇందిర అన్యోన్య దాంపత్యం. ఇందిరంటేనూ. పిల్లలంటేనూ ప్రాణంపెట్టే ఆమె భర్త కళ్ళముందు నిలిచారు.... ఈ పిల్ల చెప్తూంది నిజమేనా? ఇంత దారుణం, యింత అన్యాయం ఇందిర భర్త చేశాడా?.... ఎలా ఆ అన్యాయాన్ని సరిచేయాలో తోచక, యాంత్రికంగా కేథిటర్‌పెట్టి పిండం బయటపడడానికి నార్మల్ సెలైన్ గర్భాశయంలోకి ఎక్కించింది శ్రుతి.

రంగని తీసుకొచ్చి రూమ్‌లో పడుకోబెట్టారు. మతి చలించినదాన్లా అందరి వంకా చూస్తూంది రంగ. ఆమె మెదడులోని ఏ సున్నితమైన నరాలు దెబ్బ తిన్నాయో, ఆమె హృదయంలోని ఏ మృదువైన పొరలు చిరిగిపోయాయో ఒక్కసారి అకస్మాత్తుగా, బిగ్గరగా అరవసాగింది. 'మా బాబాయే నన్నిలా చేశాడు. మా బాబాయే నా కడుపుకు కారణం.'

వెర్రిదాన్లా చూస్తూ గబుక్కుని శ్రుతి చెయ్యి పట్టుకుంది ఇందిర. 'వాడి చెల్లెలికో, కూతురికో యిలా జరగాలి. నా శాపానికే ఆ శక్తి వుంటే వాడికా శాస్తి జరుగుతుంది' ఇందిర శాపం వెయ్యి కంఠాలతో మార్మోగుతున్నట్లుగా అనిపించింది.

